క్లుప్తంగా

ప్రత్తిపాడు తహసీల్దార్‌గా రాఘవేంద్రరావు



ప్రత్తిపాడు: ప్రత్తిపాడు తహసీల్దార్‌గా జి.రాఘవేంద్రరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ప్రత్తిపాడు తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.సిద్దార్థను ప్రకాశం జిల్లా గిద్దలూరుకు బదిలీ చేయడంతో ఆయన ఇటీవల ఇక్కడి నుంచి రిలీవ్ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు జిల్లా కలెక్టరేట్ సి సెక్షన్‌లో సూపరింటెండెంట్‌గా చేస్తున్న రాఘవేంద్రరావును ఉన్నతాధికారులు నియమించడంతో ప్రత్తిపాడులో విధుల్లో చేరారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ



ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు హెచ్‌ఈ ప్రాథమిక పాఠశాలలో సోమవారం మండల విద్యాశాఖాధికారులు సీహెచ్.రమాదేవి, లీలారాణిలు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విద్యార్థులతో మాట్లాడారు. వారి పుస్తకాలను పరిశీలించారు. అనంతరం వారితో పాఠ్య పుస్తకాలు చదివించి విద్యా సామర్థ్యాలను పరీక్షించారు. మధ్యాహ్న భోజనం అమలు, విద్యార్థుల విద్యా నైపుణ్యాలకు సంబంధించిన అంశాలపై ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎప్పటికప్పుడు రిజిస్టర్లు, రికార్డుల నిర్వహణ పూర్తి చేయాలన్నారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంచాలని సూచించారు.

జోరుగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు



పొన్నూరు: పేదల సొంతింటి కల నెరవేర్చాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలను కేటాయించి గృహ నిర్మాణాలను చేపడుతుందని ఎంపీడీవో రత్నజ్యోతి తెలిపారు. లబ్ధిదారులకు శాశ్వత హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో చేపట్టిన రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ మండలంలో శరవేగంగా జరుగుతుందని చెప్పారు. మండలంలోని 29 పంచాయతీల్లో 1799 మంది లబ్ధిదారుల ఇళ్ల పట్టాలకు రిజిస్ట్రేషన్ చేపడుతున్నామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 736 రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయని మిగిలిన 775 రిజిస్ట్రేషన్లను సచివాలయాల్లో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలు వేగవంతంగా చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

పెదనందిపాడు తహసీల్దార్‌గా లాజరస్



పెదనందిపాడు: పెదనందిపాడు తహసీల్దార్‌గా డి లాజరస్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న సుభాని బాపట్ల జిల్లా అద్దంకికి బదిలీపై వెళ్లారు. నెల్లూరు జిల్లా ఓజిలి మండలంలో పనిచేస్తున్న లాజరస్ పెదనందిపాడుకు బదిలీపై వచ్చారు.

మెడికల్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



పొన్నూరు: పట్టణంలోని మెడికల్ షాపులలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. మందులకు ఎలాంటి బిల్లులు లేకుండా, నాణ్యత లేని నాసిరకం, కాలం చెల్లిన మందులు విక్రయిస్తున్నారని వచ్చిన సమాచారంతో పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లోని 3మెడికల్ షాపులలో అధికారులు తనిఖీలు చేశారు. కొనుగోలు, అమ్మకపు బిల్లుల రికార్డులు సక్రమంగా నిర్వహించని కారణంగా మూడు మెడికల్ షాపులపై కేసులు నమోదు చేసినట్లు గుంటూరు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు తెలిపారు.

జీజీహెచ్‌కి సర్జికల్ పరికరాల అందజేత

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌కి ఎస్క్యూఎల్ సర్జికల్స్ అధినేత కోటగిరి శోభన్‌బాబు సోమవారం రూ. 1.10 లక్షల విలువ గల బ్లడ్ కలెక్షన్ ట్యూబ్‌లు, సర్జికల్ గ్లౌజ్‌లను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రి అభివృద్ధికి ప్రభుత్వంతోపాటు, పలువురు దాతలు ముందుకు వచ్చి సహాయం అందజేయడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ పద్మశ్రీ , డాక్టర్ చంద్రకుమార్, డాక్టర్ అబ్దుల్ సత్తార్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, గంగమ్మ, బయోమెడికల్ ఇంజినీర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

టీడీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడి భూదందా



రజకుల శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి రోడ్డు కోసం కోసం చదును చేసిన భూమి



టీడీపీ నేత స్థలంలోకి వెళ్లటానికి ఆర్‌అండ్‌బీ స్థలంలో నిర్మాణం చేస్తున్న రోడ్డు

రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రజకుల శ్మశాన వాటిక స్థలాన్ని ఆక్రమించి రోడ్డు నిర్మాణం

చేబ్రోలు: రజకులకు చెందిన శ్మశాన వాటిక స్థలాన్ని స్థానిక టీడీపీ నేత రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం ఆక్రమించుకొని రోడ్డు నిర్మిస్తుండటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో సోమవారం వెలుగులోకి వచ్చింది. నారాకోడూరు గ్రామ పరిధిలో జీబీసీ రహదారి నుంచి కొద్ది దూరంలో టీడీపీ మాజీ ఎమ్మెల్యే అనుచరుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొంత భూమిని చదును చేసి ప్లాట్లు వేసే పనులు చేపట్టాడు. ఆ భూమికి రహదారి నిమిత్తం రెండు రోజులుగా పొన్నూరు వెళ్లే ప్రధాన రహదారి నుంచి సదరు టీడీపీ నేతకు చెందిన భూమి వరకు వెళ్లే స్థలంలో జేసీబీతో పిచ్చి మొక్కలు తొలగించి చదును చేసి రహదారి నిర్మాణం చేస్తున్నారు. రజకుల శ్మశాన వాటిక స్థలం , ఆర్‌అండ్‌బీకి చెందిన విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించుకొని రోడ్డు నిర్మాణం చేస్తుండటంపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘ కాలంగా రజకుల శ్మశాన వాటిక స్థలంగా ఉన్న భూమిలోని కొంత బాగాన్ని ఆక్రమించుకోవటంతో పాటు జీబీసీ రహదారి నుంచి టీడీపీ నేతకు చెందిన భూమి వరకు ఉన్న ప్రభుత్వ భూమిని సైతం కబ్జా చేసి రోడ్డు నిర్మాణం చేస్తుండటంపై రజక సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సంఘటనపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

దీనిపై తహసీల్దారు రమాదేవిని సాక్షి వివరణ కోరగా సమస్య తమ దృష్టికి రాలేదన్నారు. ఆక్రమణలపై వాస్తవాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సజావుగా ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

సీఐ నిసార్ బాషా



పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్న సీఐ

ప్రత్తిపాడు: ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు నిర్వహించేందుకు కావలసిన అన్ని ఏర్పాట్లను పోలీసుశాఖ చేపడుతుందని ప్రత్తిపాడు సీఐ నిసార్ బాషా అన్నారు. మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లోని పోలింగ్ స్టేషన్లను సోమవారం సీఐ నిసార్‌బాషా సిబ్బందితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్లను పరిశీలిస్తున్నామన్నారు. అందులో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు ఎన్ని ఉన్నాయనేది గుర్తిస్తున్నామని చెప్పారు. ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టబోయే ముందస్తు ఏర్పాట్లపై సమాలోచనలు చేస్తున్నామన్నారు.

జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థిని ప్రతిభ

రాష్ట్ర స్థాయి పోటీలకు నమూనా ఎంపిక



ఎంపికైన ప్రాజెక్టుతో విద్యార్థిని, ఉపాధ్యాయులు

ప్రత్తిపాడు: సైన్స్ ఎగ్జిబిషన్‌లో ముట్లూరు హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. జిల్లా కేంద్రం గుంటూరులోని డీసీఈబీలో సోమవారం జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్టు పోటీలను నిర్వహించారు. పోటీల్లో వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని కొచ్చెర్ల శిరీష సోలార్ విద్యుత్తు ఉపయోగాలను వివరించే 'సోలార్ స్మార్ట్ బేబి క్రాడిల్' ప్రాజెక్టును తయారు చేసి ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన ఈ ప్రాజెక్టును రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఉన్నతాధికారులు ఎంపిక చేశారు. ఈ నెల 18న తిరుపతిలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాజెక్టును ప్రదర్శించనున్నట్లు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు వి.ఎస్ రామాంజనేయులు, శ్రీనివాసరావులు తెలిపారు. విద్యార్థిని శిరీషతో పాటు సహకరించిన ఉపాధ్యాయులకు డీఈవో శైలజ, ఉప విద్యాధికారి వెంకటేశ్వరరావు, హెచ్ఎం జోస్‌మేరతలు అభినందనలు తెలిపారు.

ఏఎన్‌యూతో ధనలక్ష్మి గ్రూప్ ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, చిలకలూరిపేటలోని ధనలక్ష్మి గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ మధ్య ఎంఓయూ(అవగాహనా ఒప్పందం) కుదిరింది. వీసీ ఆచార్య పి. రాజశేఖర్ సమక్షంలో సోమవారం యూనివర్సిటీలో రిజిస్ట్రార్ ఆచార్య బి. కరుణ, ధనలక్ష్మి గ్రూప్ డైరెక్టర్ ఎస్. హనుమంతరావులు ఎంఓయూ పత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ అధికారులు మాట్లాడుతూ ఎంబీఏ కోర్సు రూపకల్పన, విద్యార్థులకు ప్రాజెక్టుల నిర్వహణ, ఉద్యోగ అవకాశాల కల్పన వంటి అంశాలపై పరస్పరం కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. విభాగాధిపతి ఆచార్య వి. చంద్రశేఖరరావు, అధ్యాపకులు ప్రసన్న కుమార్, చక్రవర్తి, జాకీర్ హుస్సేన్, విజయవాణి, ఉమ , శ్యామల పాల్గొన్నారు.

వలంటీర్లు బాధ్యతతో పనిచేయాలి

కొల్లూరు : ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను సంబంధిత లబ్ధిదారులకు వలంటీర్లు సకాలంలో అందించాలని కొల్లూరు ఈఓ బి. మల్లికార్జున సూచించారు. సోమవారం కొల్లూరు పంచాయతీ కార్యాలయంలో వలంటీర్లకు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులకు మంజూరైన ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డులను సకాలంలో పంపిణీ చేయడంతో పాటు, సామాజిక సాధికార కుల గణనను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం ఉచితంగా జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు చేస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియ తుది దశకు చేరుకున్న తరుణంలో మిగిలిపోయిన లబ్ధిదారుల వివరాలను సేకరించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయించే బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

చేబ్రోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కే జ్యోతి సోమవారం తెలిపారు. ఎంపీపీ కే సాహితి అధ్యక్షతన జరిగే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం జరుగుతుందని చెప్పారు. సమావేశానికి మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని కోరారు.

పొన్నూరు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి. రత్నజ్యోతి సోమవారం తెలిపారు.ఎంపీపీ భవనం పద్మలీల అధ్యక్షతన ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కాచి చల్లార్చిన నీటినే తాగండి

నగర ప్రజలకు కమిషనర్ కీర్తి చేకూరి సూచన



చికిత్స పొందిన మహిళ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలని కమిషనర్ కీర్తి చేకూరి సూచించారు. ఆమె సోమవారం ఉదయం పొన్నూరు రోడ్డులోని బరహీమం పంజా, పకీర్ గూడెం ప్రాంతాల్లో కార్పొరేటర్లు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పర్యటించారు. తాగునీటిలో క్లోరిన్ తగుపాళల్లో ఉన్నదీ, లేనిది నేరుగా పరిశీలించారు. అదే ప్రాంతంలో విరేచనాలతో అనారోగ్యం గురై జీజీహెచ్‌లో చేరి డిశ్చార్జ్ అయిన బాధిత కుటుంబాలను నేరుగా సందర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారి గృహాలకు సరఫరా జరిగే తాగునీటి విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సదరు ప్రాంతంలో ఇంటింటి జరిగే సర్వేపై పూర్తి సమాచారం అందుబాటులో లేకపోవడంతో నిర్లక్ష్య వైఖరి కనపరిచిన వార్డ్ ఎమినిటీ సెక్రటరీ కిరణ్మయికు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఎస్‌ఈని ఆదేశించారు. నగరపాలక సంస్థ నిర్వహించే సర్వే పారదర్శకంగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని తెలిపారు. అదే ప్రాంతంలో జీజీహెచ్ నుంచి డిశ్చార్జ్ అయిన పకీర్ గూడెం నివాసి 60 సంవత్సరాల సయ్యద్ ముంతాజ్ ఇంటికి వెళ్లి తాగునీటి క్లోరిన్ పరీక్షలు నిర్వహించారు. తాగునీటిని కాచి చల్లార్చి తాగాలని ఆమె సూచించారు. ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటి సరఫరా సమయంలో నివాసాల వద్ద నుంచి శాంపిల్స్ సేకరించి క్లోరిన్ శాతాన్ని పరిశీలించారు.

తాగునీటి సరఫరా జరిగే అన్ని ప్రాంతాల్లో సర్వే

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ కేసులు నమోదైన ప్రాంతాలే కాకుండా రిజర్వాయర్ నుంచి తాగునీటి సరఫరా జరిగే అన్ని గృహాల్లోనూ ఎమినిటీ సెక్రటరీలు, ఏఎన్ఎంలతో డోర్ టూ డోర్ సర్వే నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా సమస్య ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిన వెంటనే సమీపంలోని వైఎస్సార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపుతున్నామని కమిషనర్ చెప్పారు. ఎమినిటి సెక్రటరీలు, హౌసింగ్‌లో విధుల్లో ఉన్న వారు కూడా వార్డుల్లో తాగునీటి సరిఫరా సమయంలో క్లోరిన్ పరీక్షలు నిర్వహించి రిపోర్టును సంబంధిత ఏఈలను అందించాలని ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారుల తాగునీటి పరీక్షల సమగ్ర నివేదికలను డీఈఈలు, ఈఈలు పరిశీలించి, ఇంజినీరింగ్ గ్రూప్‌లో అప్లోడ్ చేయాలని ఆమె ఆదేశించారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నగరంలో తాగునీటి సరఫరాపై ప్రజలు ఎటువంటి ఆందోళనకు గురికావద్దని, వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసే నీటిని కూడా కాచి చల్లార్చిన తరువాతే వినియోగించుకోవాలని సూచించారు. ఇప్పటికే నగరపాలక సంస్థ లో తాగునీటి సమస్యల సత్వర పరిష్కారం కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని, ఏదైనా సమస్య వస్తే 0863-2345103కి ఫిర్యాదు చేయాలని తెలిపారు. పర్యటనలో కార్పొరేటర్లు సంకూరి శ్రీనివాస్ ,షేక్ ఖాజా మొహిద్దిన్ చిష్టి, ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ శ్రీధర్, ఏఈ సునీల్, సీఎంహెచ్ఓ డాక్టర్ డి.ఆషా, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

డెప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

నగరపాలక సంస్థ పరిధిలోని శారదా కాలనీ రిజర్వాయర్‌లో డెప్యూటీ కమిషనర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని నగర కమిషనర్ కీర్తి చేకూరి సోమవారం తెలిపారు. తాగునీటి సరఫరా, శాంపిల్స్ పరిశీలన, లీకుల మరమ్మతులు, పారిశుద్ధ్య పనుల నిర్వహణకు ప్రత్యేక అధికారుల బృందాల్ని ఏర్పాటు చేస్తున్నామని ఆమె పేర్కొన్నారు. శారదా కాలనీ రిజర్వాయర్‌లో డెప్యూటీ కమిషనర్ సీహెచ్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో 90000 02109 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, ప్రజలు తాగునీటి సమస్యలపై సమాచారం అందిస్తే సత్వర చర్యలు తీసుకుంటామని తెలిపారు. శారదా కాలనీలో 1వ లైను నుంచి 9వ లైన్ వరకు రమేష్‌బాబు, 10 నుంచి 20 వరకు మహ్మద్ రఫిక్, 21 నుంచి 30వ లైన్ల వరకు కె.రాము డీఈఈలను ప్రత్యేక అధికారులుగా నియమించామని పేర్కొన్నారు. వారి కింద ఇద్దరు ఏఈలను కేటాయించామని చెప్పారు. శారదా కాలనీ 1 నుంచి 30 లైన్ల వరకు ప్రతి లైన్‌పై లీకులు గుర్తింపు, మరమ్మతు, డ్రెయిన్లలో పైప్ లైన్ల షిఫ్టింగ్, ప్రతి ఇంటిలో తాగునీటి శాంపిల్స్ సేకరణ, క్లోరినేషన్ తదితర చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. శారదా కాలనీలో మెరుగైన పారిశుద్ధ్య పనులు జరిగేలా ప్రజారోగ్య విభాగ అధికారులకు సహకారంగా రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లకు విధులు కేటాయించామని కమిషనర్ వెల్లడించారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న మినరల్ వాటర్ ప్లాంట్‌లలో కూడా నీటి నమూనాలు సేకరించి, పరీక్షల నిమిత్తం డైరెక్టర్ ఆఫ్ ఫుడ్ కంట్రోల్ విభాగానికి పంపాలని ఆదేశించారు.

గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డికి ఘన స్వాగతం



గుంటూరు ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి రమణకు స్వాగతం పలుకుతున్న బలసాని కిరణ్‌కుమార్,నాయకులు

గుంటూరు రూరల్: వైఎస్సార్‌సీపీ గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం ఎంపీ అభ్యర్థి ఉమ్మారెడ్డి రమణకు పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. సోమవారం ఏటుకూరులోని నియోజకవర్గ కార్యాలయం నుంచి కార్లు, బైక్‌లపై భారీ ర్యాలీతో తాడేపల్లికి తరలి వెళ్లారు. అనంతరం ఎంపీ అభ్యర్థిని కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో జగనన్న ప్రభుత్వంలో ప్రజలకు జరిగిన మేలు, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పత్తిపాడు నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదగాలి

స్పైసెస్ బోర్డ్ డెప్యూటీ డైరెక్టర్ అనస్ దెబ్బర్మ



వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న అనస్ దెబ్బర్మ

చేబ్రోలు: విద్యార్థులంతా ఎంటర్‌ప్రెన్యూర్‌లుగా ఎదగాలని గుంటూరులోని రీజనల్ ఆఫీస్ స్పైసెస్ బోర్డ్ డెప్యూటీ డైరెక్టర్ అనస్ దెబ్బర్మ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ''మేరా యువ భారత్ సుగంధ ఉద్యోగ్ మంథాన్'' కార్యక్రమంలో భాగంగా ''బూట్ క్యాంప్ ఆన్ కల్టివేషన్, క్వాలిటీ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్‌పోర్ట్ –ఎంపవరింగ్ యూత్ స్పైస్‌ప్రెన్యూర్'' అనే అంశంపై విద్యార్థులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్పైసెస్ బోర్డ్ డెప్యూటీ డైరెక్టర్ అనస్ దెబ్బర్మ మాట్లాడుతూ జిల్లాలో సాగవుతున్న మిర్చి, పసుపు పంటలను వివిధ దేశాలకు ఎగుమతి చేసి ఎంటర్ ప్రెన్యూర్‌లుగా ఎలా ఎదగవచ్చో తెలిపారు. గుంటూరులోని నాబార్డ్ జిల్లా డెవలప్‌మెంట్ మేనేజర్ జీ.శరత్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న చిన్న ఆలోచనలను ఆచరణలోనికి తీసుకొని ఆర్థికాభివృద్ధి ఎలా సాధించవచ్చో తెలిపారు. లాం ఫాం శాస్త్రవేత్త అనిల్ కుమార్, జంగం కిరణ్ ప్రభు, శ్రీచైతన్య తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాల ఆరాధ్యుడు బీపీ మండల్



విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

గుంటూరు రూరల్: సామాజిక ఉద్యమకారుడు, రిజర్వేషన్ల సాధకుడు బీపీ మండల్ అని బీసీ సంఘం నాయకుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం అమరావతి రోడ్డులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు నందున్న బీపీ మండల్ విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీపీ మండల్ విగ్రహం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించటం జరిగిందన్నారు. వెనుకబడిన వర్గాల ఆరాధ్యుడు బీపీ మండల్ అని కొనియాడారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ మండల్ సిఫారసుల్లో కేవలం రెండింటిని మాత్రమే అమలు చేస్తున్నారని ఇది చాలా అన్యాయమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు కళ్లు తెరిచి బీసీ వర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పివి రమణయ్య, కుమ్మరి క్రాంతికుమార్, టి కేశవయ్య, దాసరి శివకుమార్, పీ బాలయ్య, డాక్టర్ కోటేశ్వరరావు, టి నరసింహారావు, గాయత్రి, తదితరులున్నారు.

అతిసారంపై జాగ్రత్తలు అవసరం

డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



గుంటూరు మెడికల్ : అతిసార సోకినప్పుడు వాంతులు, విరోచనాల ద్వారా శరీరంలో నీటి లవణాలు ఎక్కువగా కోల్పోయి ప్రాణాపాయం సంభవించవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అతిసారపై అవగాహన కలిగి ఉండి అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. వ్యాధి సోకినప్పుడు కడుపునొప్పి, విరేచనాలు, వాంతులు, వికారం, నీరసం తదితర లక్షణాలు ఉంటాయని, వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని తెలిపారు. వాంతులు, విరేచనాలు అవుతున్నప్పుడు ఇంటి వద్ద లభించే ద్రవ పదార్థాలైన గంజి, మజ్జిగ, నిమ్మరసం, బార్లి, షరబత్, కొబ్బరినీరు తీసుకోవాలని సూచించారు. దీనివల్ల శరీరం కోల్పోయిన నీరు, లవణాలు తిరిగి పొందుతాయని తెలిపారు. భోజనానికి ముందు, మల విసర్జన తరువాత సబ్బుతో చేతులు కడుక్కోవాలని చెప్పారు. ఆహార పదార్థాల్ని వేడిగా తీసుకోవాలని, చెడిపోయిన, కుళ్లిపోయిన మాంసం, పండ్లు, కూరగాయలు వంటకు వినియోగించవద్దని ఆమె వివరించారు. తాగేనీటిపై మూతలు ఉంచాలని, రోడ్లపై బయట ఈగలు వాలిన తినుబండారాలు, ఆహార పదార్థాలు, పానీయాలు తీసుకోవద్దన్నారు. విరేచనాలు అవుతున్నప్పటికీ బిడ్డకు తల్లి పాలు తప్పనిసరిగా ఇవ్వాలని తెలిపారు. విరేచనాలు అవుతున్న సమయంలో తీపి పదార్థాలు, ఆకుకూరలు తీసుకోకూడదని వివరించారు. బ్లీచింగ్‌తో శుభ్రం చేసిన నీటిని మాత్రమే తాగడానికి వినియోగించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగడం చాలా ఉత్తమమని పేర్కొన్నారు. సమీపంలోని అంగన్‌వాడీ, ఆశ, ఏఎన్ఎంల వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా లభిస్తాయని, ప్రజలు వినియోగించుకోవాలని ఆమె సూచించారు. వదంతులు, అపోహలు నమ్మి భయభ్రాంతులకు గురికావద్దని తెలిపారు. సందేహాలు, వైద్య సహాయం కోసం 8341396104, 7207595104 నంబర్లకు సంప్రదించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి కోరారు.

క్రమశిక్షణతో కూడిన చదువుతో జీవితంలో ఉన్నతి

నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు



విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెబుతున్న మేయర్ మనోహర్ నాయుడు

గుంటూరు ఎడ్యుకేషన్: క్రమశిక్షణతో కూడిన చదువుతో జీవితంలో ఉన్నతస్థానానికి చేరుకోవచ్చని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు పేర్కొన్నారు. జీకేఆర్ హైస్కూల్ ఏటీ అగ్రహారం, పట్టాభిపురం క్యాంపస్‌లలోని టెన్త్ విద్యార్థులకు సోమవారం ఫేర్‌వెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మేయర్ మనోహర్ నాయుడు మాట్లాడుతూ తల్లిదండ్రుల పెంపకం, ఉపాధ్యాయుల బోధనలో పాఠశాల విద్యను పూర్తి చేసుకుని బయటకు వెళుతున్న విద్యార్థులు మంచి, చెడుల విచక్షణ తెలుసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. మంచి స్నేహితుల్ని కలిగి ఉండటం మన అదృష్టమని, చెడు స్నేహాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకోరాదని హితవు పలికారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో హుషారెత్తించారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త డి. తిరుపతిరెడ్డి, పాఠశాల డైరెక్టర్ జి.కొండారెడ్డి, జి.జనార్దన్‌రెడ్డి, హెచ్ఎంలు శైలజారెడ్డి, సుశీలారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్ ఔషధి కేంద్రం ప్రారంభం

నెహ్రూనగర్: గుంటూరు జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన్ ఔషధి(జనరిక్ మెడికల్ షాప్) కేంద్రాన్ని గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, సొసైటీ చైర్మన్ వై. భాగ్యలక్ష్మి సోమవారం ఏటీ అగ్రహారం మెయిన్ రోడ్డు, వాటర్ ట్యాంకుల వద్ద ప్రారంభించారు. కార్యక్రమంలో బిజినెస్ మేనేజర్ డి. హరిగోపాలం, ఆఫీస్ మేనేజర్ కె. శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.